క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: సాతులూరు విద్యుత్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. సాతులూరు, దొండపాడు, చందవరం, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

డివిజన్‌లో తేలికపాటి వర్షం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం తేలికపాటి వర్షాలు కురిసింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం ఉదయానికి 10.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. నరసరావుపేట డివిజన్‌లోని చిలకలూరిపేటలో 15.4ఎం.ఎం, యడ్లపాడు 11.8 ఎం.ఎం, ఈపూరులో 3.8 ఎం.ఎం., నరసరావుపేటలో 11.4 ఎం.ఎం., నూజెండ్లలో 10.4, శావల్యాపురంలో 0.4 ఎం.ఎం. వినుకొండలో 4.2 ఎం.ఎం. నాదెండ్ల 16.2 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. అలాగే డివిజన్‌లో 83.8 వర్షపాతం నమోదు కాగా సగటున 8.4 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వినుకొండలో హెచ్‌ఐవీపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ స్వచ్ఛంద సంస్థ ఆదేశాల మేరకు వినుకొండ వైద్య ఆరోగ్య శాఖ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నూజెండ్ల మండలంలోని సచివాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ చేస్తున్న కార్యక్రమాలను వారు అభినందించారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపకూడదన్నారు. ప్రభుత్వం బాధితుల కోసం చేస్తున్న సేవలను గురించి వివరించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో పాల్గొని సంస్థ సభ్యులు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ, ఏడుకొండలు, రహంతా, రిబ్కా, విజయ, గంగిరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల సంరక్షణపై క్విజ్ పోటీలు

రొంపిచర్ల: స్థానిక అంగన్ వాడీ సెంటర్‌లో శనివారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భవతులకు, రెండు సంవత్సరాల లోపు పిల్లలున్న తల్లిదండ్రులకు వెయ్యి రోజుల సంరక్షణపై క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు వెయ్యి రోజుల పాటు మంచి పోషక ఆహారం అందించి సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహార పదార్థాలను కూడా తెలియజేశారు. అలాగే అందుబాటులో ఉండే ఆకుకూరలను ఎక్కువగా అందించటం వల్ల పిల్లల్లో పెరుగుదల వేగవంతంగా ఉంటుందని తెలిపారు. అనంతరం వెయ్యి రోజుల పిల్లల సంరక్షణపై క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. కళావతి, ఎస్.నాగమల్లేశ్వరి, కె.లక్ష్మీ, ఎన్. విజయలక్ష్మీ, వై.విష్ణుశ్వరి, బి. లక్ష్మీ, కె. అంజమ్మ, ఆయాలు, పలువురు గర్భిణులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక



రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ సోషల్ ఆడిట్‌పై ప్రజా వేదిక నిర్వహించారు. ప్రజా వేదిక ఎండీవో మాధ్యుబాబు అధ్యక్షతన జరిగింది. ఈ నెల 8వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఎన్ఆర్ఈజీఎస్‌పై గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు గ్రామంలో జరిగిన పనులపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలపై ప్రజా వేదికలో చర్చించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.3 లక్షల రూపాయల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఈ మొత్తాన్ని రికవరీ చేయాలని ప్రజావేదిక తీర్మానించారు. ప్రజా వేదికలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసెఫ్ కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు జగన్ మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, బాషా, ఏపీవో కోటా ప్రసాద్, ఎస్ఆర్‌పీలు, ఎన్ఆర్ఈజీఎస్ సాంకేతిక సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా జస్వంతరావు

నరసరావుపేట: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా ఎం.జస్వంతరావు నియమితులయ్యారు. శనివారం రాష్ట్రంలోని పలువురు కమిషనర్లను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రత్యేక చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు కమిషనర్‌గా పనిచేస్తున్న సి.రవిచంద్రారెడ్డి తన మాతృసంస్థ అయిన వర్క్స్ అండ్ అకౌంట్స్ విభాగానికి బదిలీ అయ్యారు. జస్వంతరావు ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా వ్యవహరిస్తూ ప్రస్తుతం పోస్టింగ్‌కోసం వెయిట్ చేస్తుండగా నరసరావుపేటకు బదిలీ చేశారు.

చిలకలూరిపేట పోలీసులకు రివార్డులు

- కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడి అరెస్టు
- అభినందించిన గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు



ఐజీ నుంచి రివార్డు అందుకుంటున్న సీఐ

నాదెండ్ల: కేసుల ఛేదనలో సాంకేతికతను వినియోగించి చాకచక్యంగా నిందితులను పట్టుకున్న చిలకలూరిపేట రూరల్ సీఐ బత్తిన సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్సై వి.బాలకృష్ణలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి రివార్డుతో సత్కరించారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద ఈ నెల 15న టైరు పంక్చరైన కారును రోడ్డు పక్కన నిలిపి రిపేరు చేసుకుంటున్న వడాల కృష్ణ, రవికిషోర్‌లను గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో ఇరువురూ మృతి చెందారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలంలో దొరికిన ఆధారాలతో విచారణ చేపట్టారు. అయితే ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సాంకేతికతను వినియోగించారు. బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద గల సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తుండగా, నెంబరు లేకుండా వెళ్తున్న లారీని గుర్తించి, దాని ఛాసిస్ నెంబర్ తీసుకుని వివరాలు సేకరించారు. ఈ-చలానా పరిశీలించగా ఒంగోలుకు చెందిన లారీగా గుర్తించారు. లారీ యజమానికి ఫోన్ చేసి బాడుగ ఉంది లారీ కావాలంటూ సంప్రదించారు. అయితే తాను అశోక్ లేలాండ్ షోరూంలో ఉన్నానని, బాడుగకు రావటం కుదరదని ముద్దాయి చెప్పాడు.

దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, తానే ప్రమాదానికి కారణమని తెలిపాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సిఫార్సు మేరకు నరసరావుపేటలో జరిగిన నేర సమీక్షా సమావేశంలో రూరల్ సీఐ సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్సై బాలకృష్ణలను అభినందించి రివార్డులను అందించారు.

సామాజిక సాహితీ సంస్కర్త గురజాడకు నివాళులు



ఈపూరులో గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ నిర్వాహకులు శ్రీనివాసరావు



యడ్లపాడులో నిర్వహించిన గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమం

నాదెండ్ల: మండల కేంద్రమైన యడ్లపాడులోని నారాయణ స్కూలులో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావుతో పాటూ ఉపాధ్యాయులు ముందుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణ దృష్టితో రచనలు చేసిన గొప్ప సామాజిక సాహితీ సంస్కర్త గురజాడ అప్పారావు అని కొనియాడారు. ఆయన రాసిన పూర్ణమ్మ, కన్యాకాగేయాలు ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. విద్యార్థులకు గురజాడ అప్పారావు జీవిత విశేషాలు, ఆయన రచనలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జేవీవీ డివిజన్ అధ్యక్షురాలు చెరుకూరి సృజన, రాష్ట్ర కార్యదర్శి బుచ్చిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులోని శాఖా గ్రంథాలయ నిర్వాహకులు జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 162వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహకులు మాట్లాడుతూ అభ్యుదయ కవితా పితామహుడు, రచయిత, సంఘ సంస్కర్త కన్యాశుల్కం నాటక రచయిత, అంటరానితనం, బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి దురాచారాలపై తమ రచనల ద్వారా పోరాటం చేసిన సాహితీవేత్త మహనీయుడు గురజాడ అని కొనియాడారు. తెలుగు సాహిత్యానికి వెలుగుజాడ గురజాడ అభ్యుదయమే నిబద్ధతగా సాగిన ఆయన జీవితం చైతన్య గీతమన్నారు. ప్రజలందరికి అర్థమయ్యే వాడుక భాషల్లో రచనలు చేశారన్నారు. మూఢవిశ్వాసాలు, దురాచారాలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నప్పుడు తన కలంతో ప్రజలను చైతన్యపరిచేందుకు ఉద్యమించిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని అన్నారు.అనంతరం విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత అవకాశాలు

- విద్యార్థులకు డీఎస్పీ నాగేశ్వరరావు సూచన
- ఘనంగా ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల సెలబ్రేషన్స్



ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులతో ముఖ్యఅతిథులు, పాలకవర్గ ప్రతినిధులు

నరసరావుపేట: విద్యార్థులు క్రమశిక్షణతోనే ఉన్నత అవకాశాలు సాధించుకోగలుగుతారని డీఎస్పీ కె.నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కేసానుపల్లిలోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే సెలబ్రేషన్స్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి విద్యార్థుల ఆలోచనలు లక్ష్యం వైపు కాకుండా మత్తువంటి చెడువ్యసనాల వైపు వెళ్లటం బాధాకరమన్నారు. క్షణికావేశాలు, క్షణిక ఆలోచలకులోనై చెడు నిర్ణయాలు తీసుకొని చిన్నపాటి నేరాలకు పాల్పడి తల్లిదండ్రులకు బాధ కలిగిస్తున్నారని, కావున లక్ష్యసాధనకు కృషి చేసుకుంటూ తల్లిదండ్రులు, తోటి విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. గౌరవ అతిథిగా హాజరైన సీఐ పి. రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుపై ఏకాగ్రత, మంచి అలవాట్లు పెంపొందించుకుని తమ వ్యక్తిగత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కోరారు. కళాశాల చైర్మన్ షేక్ మీరావలి మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఈ ఆధునిక సాంకేతిక పోటీ ప్రపంచానికి తగినట్లుగా నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోవాలని సూచించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంటు షేక్ కరీం మోహిద్దీన్ మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సు కోసం అన్నిరకాల మౌలిక సదుపాయాలు రాజీలేకుండా సమకూర్చామని, విద్యార్థులు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు.

కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులకు సంపూర్ణ విద్య అందించటంతో పాటుగా తగిన ఉద్యోగాలు క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా తెచ్చిపెట్టేందుకు కావలసిన ప్రత్యేక శిక్షణపై శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, కళాశాల ప్రిన్సిపాల్ జి.నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందచేశారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పవన్‌కుమార్

చిలకలూరిపేట: విద్యార్థులు జాతీయస్థాయి గణిత, సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించటం అభినందనీయమని వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ దండా పవన్‌కుమార్ చెప్పారు. స్ప్రింగ్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ మాథమాటిక్స్ ఒలంపియాడ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరిలో మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒలంపియాడ్ పోటీలు జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఇటీవల ప్రకటించిన ఫలితాలలో వికాస్ విద్యాసంస్థలకు చెందిన ఎ.రేణుక, ఎస్.ఇందుశ్రీ, ఎస్‌కె ఇమ్రాన్, ఈ.యశ్వంత్, కె.రుత్విక, పి.తేజశ్వని, ఎస్.నమృతవేణి, సీహెచ్ దీక్షిత్, ఎస్.బతిజైన్ 25 లోపు ర్యాంకులు సాధించారు. ఈ విద్యార్థులకు శనివారం పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దండా పవన్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో 2.13 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో తమ విద్యార్థులు ర్యాంకులు సాధించటం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపవరంలో కుక్క కాటుకు పంది మృత్యువాత!



ఖననానికి తరలిస్తున్న పంది కళేబరం

నాదెండ్ల: కుక్కల బెడద గ్రామాల్లో తీవ్రమౌతోంది. కుక్కకాటుకు గురై రూ.50 వేలు విలువ జేసే పంది మృతి చెందిన సంఘటన గణపవరం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు మన్నెం రాఘవ తెలిపిన వివరాల మేరకు గణపవరం సినిమా హాల్ రోడ్డులో నివాసం ఉండే రాఘవ జీవాలు మేపుకుంటూ జీవిస్తుంటాడు. తమ కులదైవం అంకమ్మ స్వామి దేవర పేరిట పందిని బహూకరించాడు. ఏడాది కాలంగా పందిని మేపుతున్నాడు. సదరు వరాహం ఈనెల 18న కుక్కకాటుకు గురైంది. దీంతో అనారోగ్యానికి గురైన పంది శుక్రవారం వర్షం కురవటంతో తడిచి ఉదయానికి మృతి చెందింది. శనివారం రాఘవ కుటుంబ సభ్యులు పూజలు చేసి తమ పొలంలో ఖననం చేశారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటికే లేగదూడలు, గొర్రెలపై దాడి చేయటంతో పదుల సంఖ్యలో మృతి చెందాయి. చిన్నారులు, పెద్దలను సైతం కరిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పాఠశాలలకు వెళ్ళే చిన్నారులు కుక్కల మందలను చూసి బెంబేలెత్తుతున్నారు. పంచాయతీ అధికారులు కుక్కల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుమల లడ్డూపై బాబు విషప్రచారం



నరసరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన దారుణ వైఫల్యాల నుంచి, ప్రజలను ఏ మార్చి, పబ్బం గడుపుకునేందుకు, మొన్న బోట్లను అడ్డం పెట్టుకొని, నిన్న జత్వానిని అడ్డంపెట్టుకుని, నేడు సాక్షాత్తు పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అడ్డం పెట్టుకుని విష ప్రచారాలకు, ప్రజాకంటక పాలనకు పూనుకున్నారని పల్నాడు జిల్లాకు చెందిన నైతిక ఉద్యమ కార్యకర్త ఈదర గోపీచంద్ శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. వైఎస్ జగన్ చెప్పినట్లు బాబు పాపాలన్నీ పండే రోజు త్వరలోనే వస్తుందన్నారు.

23 నాటికి ఈ-క్రాప్ చేయించాలి

నాదెండ్ల: ఈ నెల 23తో రైతులు ఈ క్రాప్ బుకింగ్‌తో పాటూ ఈకేవైసీ చేయించుకోవాలని యడ్లపాడు ఏవో సీహెచ్ సరిత చెప్పారు. ఈ మేరకు శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈక్రాప్ నమోదు చేయించుకోవటం వలన ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు పంట నష్ట పరిహారం పొందవచ్చన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు లభిస్తాయన్నారు.

కల్తీ వ్యాపారంపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట ఈస్ట్: జిల్లా కేంద్రంలో కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ శనివారం తెలిపారు. జంతువుల కొవ్వుతో తయారైన కల్తీ నూనెలు, కల్తీ ఆహార పదార్థాలు, కల్తీ మందులతో ప్రజల ఆరోగ్యాన్ని చెడగొడుతున్నారన్నారు.

28న యడ్లపాడు మండల సమావేశం

నాదెండ్ల: యడ్లపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హనిమిరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

క్రీడాకారుల ఎంపిక

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో అండర్-14, అండర్-17 స్కూల్ గేమ్స్‌కు సంబంధించి క్రీడాకారుల ఎంపిక ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బీఎం. సుభాని శనివారం తెలిపారు. ఆరు క్రీడలకు సంబంధించిన ఎంపిక జరుగుతుందన్నారు. కబాడీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్‌బ్యాట్మింటన్ ఆటలు ఆడేందుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు అందరూ సోమవారం 9.30 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రొంపిచర్లలో హాజరు కావాలని కోరారు.

లాటరీ టిక్కెట్ల విక్రేత అరెస్టు

నాదెండ్ల: యడ్లపాడులో సింగిల్ నెంబర్ లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న షేక్ బాజీని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నిందితుడు బాజీ ఆన్‌లైన్‌లో బోడో యాప్ ద్వారా లాటరీ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసి సింగిల్ నెంబర్ లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మసీదు సెంటర్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ.3,400లు నగదు, లాటరీ టిక్కెటు నెంబర్లు గల షీటు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఇస్సపాలెంలో ధ్యాన శిక్షణ తరగతులు



ధ్యాన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న స్వామీజీ, పాల్గొన్న మహిళలు

నరసరావుపేట: ఇసప్పాలెం గ్రామంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో చాతుర్మాస దీక్ష శిక్షణ తరగతుల సందర్భంగా శనివారం బరంపేట లీలా వెంకటేశ్వర స్వామి వారి భక్త సమాజం వారిచే విష్ణు సహస్రనామ పారాయణం, సత్సంగ కార్యక్రమం, గీతా పారాయణం నిర్వహించారు. సజ్జాపురం స్వామీజీ మాట్లాడుతూ నవంబరు 16 సోమవారం వరకు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీనికి భక్తులు అందరూ ఆహ్వానితులే అన్నారు. కపలవాయి విజయ్ కుమార్, కేపీ.రంగారావు, పూరా భాస్కరరావు, చేగు వెంకటేశ్వరరావు, పూరా లక్ష్మీ సుజాత, మంగవల్లి నాగలక్ష్మితో పాటు అనేకమంది మహిళా భక్తులు పాల్గొన్నారు. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ గుర్తింపు అభినందనీయం

- ఎంఈవో మద్దికుంట సాంబశివరావు
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సత్కారం



ఉపాధ్యాయ గ్రహీతలను సత్కరిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

శావల్యాపురం: పాఠశాలల అభ్యున్నతితో పాటుగా సామాజిక సేవా భావం కల్గియున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తించటం అభినందనీయమని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. శనివారం స్థానిక మండల వనరుల కేంద్రంలో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘనంగా సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలతో పాటు సమాజ భాగస్వాములై భావితరాలకు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనదన్నారు. ప్రతి ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకంగా మెలగాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల గణిత బోధకులు కుమ్మరి శ్రీనివాసరాజు, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, తుమ్మలకుంట గ్రామం ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయులు బిళ్ళ రాజారమేష్ సేవలను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి, జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయలక్ష్మి, సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, షేక్ మహమ్మద్ సుభాని, ఉమా మహేశ్వరరావు, ఎస్టీయూ నాయకులు కొండ్రముట్ల వెంకటరత్నం, కంప శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు మాదాల రామకోటేశ్వరరావు, డి.రవి కుమార్, గుండ్లూరి ప్రసాదు, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది లింగాల శ్రీహరి, బోయపాటి తివిక్రమ్, మస్తాన్‌రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

డిప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న వేణుగోపాలరావు

నరసరావుపేట ఈస్ట్: చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు తెలిపారు. బరంపేటలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల పఠనా నైపుణ్యాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల నోట్స్‌బుక్స్‌తో పాటు ఉపాధ్యాయుల టీచింగ్ నోట్స్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తరచూ గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంచుకోవటంతో పాటు విద్యార్థులలో అభ్యాసన నైపుణ్యాలను పెంచాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందివ్వాలని ఆదేశించారు. అలాగే మధ్యాహ్న భోజనం ఆయా రోజుల్లో పర్యవేక్షించే ఉపాధ్యాయులు పొరపాట్లు జరగకుండా చూసుకోవాలనీ, ఎటువంటి పొరపాటు జరిగినా అందుకు బాధ్యత సదరు ఉపాధ్యాయుడుదేనని స్పష్టం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణసింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తాచాటిన శావల్యాపురం విద్యార్థులు



విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: స్కూల్ గేమ్స్ విభాగంలో శావల్యాపురం జడ్పీ స్కూలు విద్యార్థులు తమ సత్తా చూపినట్లు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డు విజయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాల్లో విజయఢంకా సాధించిన విద్యార్థులతో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడాల్లో రాణించటం అభినందనీయమన్నారు. ఈనెల 19 నుంచి 20వ తేదీ వరకు మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరిగాయని ఇందులో ఎక్కువ మంది విద్యార్థులు ఎంపిక కావటం చాలా సంతోషంగా ఉందన్నారు.

వినుకొండ పట్టణంలో జరిగే నియోజవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ చూపించి పాఠశాలకు మంచి తేవాలన్నారు. పాఠశాల పీడీ రాగుల రాధా కృష్ణమూర్తి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో అండర్-14, అండర్-17 విభా గాల్లో బాల బాలికలు విజయం సాధించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇవే కాకుండా అథ్లెటిక్స్ విభాగంలో రన్స్ పోటీల్లో తులసి (8వ తరగతి) గోల్డ్ మోడల్స్-3, షాట్‌పుట్ త్రోస్ పోటీల్లో మల్లిఖార్జునరావు (10వ తరగతి)-గోల్డ్ మోడల్, షాట్ పుట్ త్రో క్రీడ పోటీల్లో ప్రసన్న (9వ తరగతి) సిల్వర్ మోడల్ సాధించినట్లు తెలిపారు.

స్కూల్ గేమ్స్ విభాగంలో మంచి ప్రతిభ చూపిన క్రీడాకారులను పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్ కుమార్, స్టాఫ్ సెక్రటరీ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు, ఆదాంఖాన్, అబ్దుల్లా, భువనేశ్వరి, శ్రీకాంత్ అభినందించారు.

పెదకంచర్లలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని పెదకంచర్ల గ్రామపంచాయతీలో స్వభావ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛతాహీలో భాగంగా స్వచ్ఛతా హి భాగీ దారి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ ప్రభాకరరావు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ సుందరరెడ్డి మాట్లాడుతూ మనం స్వచ్ఛతను కలిగి ఉన్నామంటే మానవ సేవ చేయడమేనని తెలియజేశారు. స్వచ్ఛభారత్ మిషన్ ఏర్పడి పదేళ్లు అయిందన్నారు. పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి. రమేష్, పంచాయతీ కార్యదర్శి మోహన్‌చంద్, సుబ్బారెడ్డి, ఇంజినీరింగ్ అసిసెంట్ సాయిచంద్, హెచ్ఎం శ్రీరాములునాయక్, సీహెచ్‌వో ప్రమీల, ఏఎన్ఎం దేవమ్మ, ఆశ వర్కర్ మీరాబి, సచివాలయ సిబ్బంది దుర్గా వరప్రసాద్ నాయక్, వాగ్యానాయక్, శిరీష, మల్లేశ్వరి, గురునాథం, గ్రామప్రజలు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): ఈ-పంటలో నమోదు చేసుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని నూజెండ్ల మండల వ్యవసాయాధికారిణి సుగుణాబేగం తెలిపారు. నూజెండ్లలోని రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న ఈకేవైసీ, ఈ పంట నమోదును ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాస్తవ సాగుదారులకు మేలు కలిగేలా ఈ-పంట నమోదులో రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణలు తీసుకొచ్చిందని, పంటను అమ్ముకోవడానికే పరిమితం కాకుండా సాగు ఉత్పాదకాలు, పంట రుణాలు, సున్నా వడ్డీ, పెట్టుబడి రాయితీ, పంటల బీమా, పంట నష్టపరిహారం వంటి ఏ లబ్ధి పొందాలన్నా ఈ-పంట నమోదుతో పాటు ఈకేవైసీ వివరాలు ప్రామాణికమని తెలిపారు. ఈ నెల 23వ తేదీలో ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జి. మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.